క్లుప్తంగా

అయ్యప్ప ఆలయంలో జన్మనక్షత్ర పూజలు



అయ్యప్ప ఆలయంలో సహపంక్తి భోజనం

నగరి: పట్టణ పరిధిలోని బైపాస్ కూడలి సమీపం లోని శ్రీధర్మశాస్త అయ్యప్ప స్వామి ఆలయంలో ఆదివారం అయ్యప్పస్వామి జన్మనక్షత్రమైన ఉత్తరా నక్షత్ర పూజలు భక్తిప్రపత్తులతో నిర్వహించారు. అయ్యప్ప పాటలు పాడి, భజనలు చేశారు. ఆలయంలో భక్తులకు సహపంక్తి భోజనం పెట్టారు. లక్ష్మీ, జయచంద్ర మేస్త్రి ఉభయదారులుగా వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో భక్తులు కన్నప్ప, మునస్వామి, ఎల్లప్పరెడ్డి, రమేష్‌బాబు, సురేష్, దుర్గాప్రకాష్ స్వామి తదితరులు పాల్గొన్నారు.

మిట్టకండ్రిగలో పారిశుధ్య పనులు



నింద్ర: మండలంలోని నింద్ర గ్రామ పంచాయతీలోని మిట్టకండ్రిగ గ్రామంలో ఆదివారం రోడ్డుకు ఇరువైపులా పారిశుధ్య పనులు చేపట్టారు. సర్పంచ్ బాబురెడ్డి ఆధ్వర్యంలో తాగునీటి ట్యాంక్ వద్ద లీకేజీ, పిచ్చిమొక్కలను తొలగించారు. దళితవాడ, ఎస్టీకాలనీ, బీసీ కాలనీల్లో కూడా పరిసరాలను పరిశుభ్రం చేశారు.

వాహనదారులు జాగ్రత్తలు పాటించాలి

నింద్ర: ద్విచక్ర వాహనదారులు ప్రమాదాలకు గురి కాకుండా జాగ్రత్తలు పాటించాలని నగరి రూరల్ సీఐ భాస్కర్ అన్నారు. ఆదివారం షుగర్ ఫ్యాక్టరీ క్రాస్ వద్ద ఆయన వాహనదారులకు సూచనలు, సలహాలు ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరు ప్రమాదాలకు గురి కాకుండా చూడాలన్నారు. తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని తెలిపారు. అధిక స్పీడ్‌తో ప్రయాణించడం, ఇతర వాహనాలను ఓవర్‌టేక్ చేయడం చేయరాదని అన్నారు. ఈ కార్యక్రమంలో వాహనదారులు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

శ్రీమహాలక్ష్మి అమ్మవారికి ప్రత్యేక పూజలు



నింద్ర: మండలంలోని కేఆర్ పాళెం గ్రామంలోని శ్రీమహాలక్ష్మి అమ్మవారి ఆలయంలో ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం అమ్మవారికి అభిషేకం, అర్చనలు చేశారు. సాయంత్రం విశేష అలంకరణలో అమ్మవారికి పూజలు చేశారు. కార్యక్రమంలో గ్రామంలోని భక్తులు, ప్రజలు పాల్గొన్నారు.

నేటి నుంచి విద్యుత్ సమస్యలపై సమావేశాలు

పుత్తూరు: విద్యుత్ శాఖ పుత్తూరు డివిజన్ పరిధిలోని సబ్‌స్టేషన్స్ కమిటీ సమావేశాలు సోమవారం నుంచి రెండు రోజులపాటు నిర్వహిస్తున్నట్లు ఏపీట్రాన్స్‌కో డీఈ దేవాశీర్వాదం ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. సోమవారం ఉదయం 10.30 నుంచి 12 గంటల వరకు పుత్తూరు, గేట్‌పుత్తూరులో, మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 4 గంటల వరకు లక్ష్మీనగర్ సబ్‌స్టేషన్లలో సమావేశాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మంగళవారం ఉదయం పైడిపల్లి, మధ్యాహ్నం కల్యాణపురం సబ్‌స్టేషన్ల వద్ద సమావేశాలు నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. ఈ సమావేశాలకు ఆయా సబ్‌స్టేషన్ల పరిధిలోని వినియోగదారులు పాల్గొని తమ సమస్యలను పరిష్కరించుకోవాల్సిందిగా కోరారు.

7 మద్యం బాటిళ్లు స్వాధీనం

కార్వేటినగరం: మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకుని వ్యక్తిపై కేసు నమోదు చేశారు. ఏఎస్‌ఐ ఎళుమలైరెడ్డి కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. మండల పరిధిలోని గోపిశెట్టిపల్లి దళితవాడకు చెందిన ఆరుముగం అక్రమంగా మద్యం అమ్ముతున్నట్లు పోలీసులకు సమాచారం అందింది. ఈ మేరకు ఆదివారం సిబ్బందితో కలసి ఆరుముగం చిల్లర అంగడిపై దాడులు నిర్వహించారు. అతను పారిపోవడంతో 7 బాటిళ్లను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్టు పేర్కొన్నారు.

సామాజిక తనిఖీతో అవకతవకల వెల్లడి



మాట్లాడుతున్న డీఆర్పీ హనుమంతరాయప్ప

పాలసముద్రం: ఉపాధిహామీ పథకంలో చేసిన అవకతవకలు గుర్తించేందుకే సామాజిక తనిఖీ నిర్వహిస్తున్నట్లు జెడ్పీటీసీ సభ్యుడు అన్బలగన్, సర్పంచ్ అయ్యప్ప తెలిపారు. ఆదివారం పాలసముద్రం సచివాలయ ఆవరణలో ఏపీఓ మార్గరెట్, ఎస్ఆర్పీ మల్లికార్జున, పంచాయతీ కార్యదర్శి సత్యనారాయణ ఆధ్వర్యంలో సామాజిక తనిఖీ గ్రామ సభ నిర్వహించారు. 2023–24 సంవత్సరంలో ఉపాధిహామీ పథకంలో రూ.5కోట్ల 11 లక్షలు ఖర్చు పెట్టారు. మూడు రోజులుగా సామాజిక తనిఖీ బృందం డీఆర్పీ హనుమంతరాయప్ప ఆధ్వర్యంలో ఉపాధి పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. కార్యక్రమంలో ఉపాధి హామీ కూలీలు పాల్గొన్నారు.

గోకులాలపై పసుపు పెత్తనం



పశుపోషణపై ఆధారపడిన చిన్న, సన్నకారు రైతుల కోసం ప్రవేశపెట్టిన మినీ గోకులం పథకం అధికార పార్టీ నేతల వశమవుతోంది. పశువులకు నీడనిచ్చే పథకంపైనా రాజకీయం చేస్తున్నారు. మండలంలో మినీ గోకులాల్లో 90 శాతం తమకే కావాలంటూ పట్టుబట్టారు. ఈ మేరకు సంబంధిత అధికారులపై ఒత్తిడి తీసుకొస్తున్నారు. తమకు అనుకూలమైన వారితో దరఖాస్తులు చేయిస్తున్నారు. మండలంలో ఎంపీపీ, జెడ్పీటీసీలు, సర్పంచులు వైఎస్ఆర్ సీపీకి చెందిన వారు ఉండడంతో వారికి ఒకటి, రెండు ఇచ్చి, మిగిలిన మినీ గోకులాలన్నీ కూటమి పార్టీల కార్యకర్తలకు దక్కేలా ప్లాన్ చేశారు. ముందస్తుగా అధికారులకు మౌలిక ఆదేశాలు జారీ చేసినట్లు తెలిసింది.

– పాలసముద్రం

- తమ వారికే మంజూరు చేయాలంటున్న టీడీపీ నేతలు
- గోవులు లేనివారికి గోకులం షెడ్లు
- పంచాయతీ తీర్మానం కోసం సర్పంచ్‌లపై ఒత్తిళ్లు

మినీ గోకులం పథకానికి ఎస్సీ, ఎస్టీ, వలస, ఇతర తెగల రైతులు అర్హులు. వీరితోపాటు దారిద్ర్య రేఖకు దిగువన ఉన్న వారు, మహిళలు, దివ్యాంగులకు ప్రాధాన్యం ఉంటుంది. అర్హులు దరఖాస్తు, ఆధార్ కార్డు, ఉపాధిహామీ జాబ్ కార్డు, స్థలం హక్కు పత్రం, బ్యాంకు పుస్తకం తదితరాలను జతచేసి సంబంధిత ఎంపీడీఓకు అందజేయాలి. పశువైద్యులు గ్రామనికి వచ్చి రైతుకు పశువులు ఉన్నాయా లేదా అని పరిశీలిస్తారు. ఉపాధిహామీ ఏపీఓలు షెడ్డు నిర్మాణానికి అనువైన స్థలం, రైతు అర్హతలను పరిశీలించి ఆన్‌లైన్ చేస్తారు. అనంతరం రైతులకు గోకులం షెడ్లు నిర్మిస్తారు.



తాత్కాలిక షెడ్డులో ఉన్న పాడిపశువులు(ఫైల్)

47 మంజూరు

మండలంలో 75 మినీ గోకులాలకు దరఖాస్తులు వస్తే అందులో 47 గోకులం యూనిట్లు మంజూరయ్యాయి. ఇందులో పాడిపశువులు లేని వారికి కూడా గోకులం షెడ్లు మంజూరయ్యాయి. వర్షంలో తడుస్తూ, ఎండలో ఎండుతూ ఇబ్బందులు పడుతున్న వారి పశువుల కోసం గోకులం షెడ్లు మంజూరు చేయడం లేదు. పశు వైద్యాధికారి కూడా అధికార పార్టీ నాయకులు చెప్పిన వారివద్దే దరఖాస్తులు తీసుకుంటునానరు. గోకులం షెడ్లు మంజూరు లిస్టుల్లో బడా నాయకులు, బడా రైతులకు సంబంధించినవారి కుటుంబాలవే ఉన్నాయి. అర్హులై ఉండి గోకులం షెడ్ కోసం దరఖాస్తు చేసుకుంటే లిస్టులో పేరు లేదు.



బాలక్రిష్ణాపురంలో మినీ గోకులం షెడ్‌ని పరిశీలిస్తున్న డ్వామా పీడీ(ఫైల్)

సర్పంచులపై ఒత్తిళ్లు

మండలంలో గోకులం షెడ్లు మంజూరు లిస్టులో ఉన్న పేర్ల అన్నిటికి సంబంధిత సర్పంచ్‌లు పంచాయతీ తీర్మానం ఇవ్వాలని అధికార పార్టీ కాయకులతో కలసి ఎంపీడీఓ, సర్పంచులపై ఒత్తిడి తెస్తున్నారు. సర్పంచులు వాస్తవంగా పాడిపశువులు ఉండి లిస్టులో పేర్లు ఉండే పాడిరైతులకు మాత్రం తీర్మానంలో పేర్లు నమోదు చేసి ఇస్తున్నారు. అలా కాకుండా అందరికీ పంచాయతీ తీర్మానం ఇవ్వాలంటే కుదరదని సర్పంచ్‌లు అంటున్నారు.

పశువులు	షెడ్డు యూనిట్ విలువ, రాయితీ
2 పశువులు	రూ.1,15,000 –రూ.1,03,500,
4 పశువులు	రూ.1,85,000, రూ.1,66, 500
6 కన్నా ఎక్కువ	రూ.2,30,00, రూ.2,07,000,
20గొర్రెలు, మేకలు	రూ.1,30,000, రూ.91,000
50గొర్రెలు,మేకలు	రూ2,30,000,రూ 1,61,000,
100 కోళ్లు,	రూ 87,000, 60, 900

అర్హులందరికీ అందజేయాలి

మండలంలో పశుసంపద బాగా పెరిగింది. చాలా మంది. రైతులకు కళ్లాలు కూడా లేక రోడ్లపై, వీధిలోనే ఆవులను కట్టేస్తున్నారు. మినీ గోకులం ఇస్తే పశువులను సంరక్షించుకునే అవకాశం ఉంటుంది. రాజకీయాలకు అతీతంగా అర్హులందరికీ మినీ గోకులాలు మంజూరు చేయాలి. గతంలో ప్రభుత్వం కుల, మత, రాజకీయాలకు అతీతంగా సంక్షేమ పథకాలు అందజేశారు.

– శేఖర్ యాదవ్, వైస్ ఎంపీపీ, పాలసముద్రం

నిబంధనల మేరకే మంజూరు



నిబంధనల మేరకు అర్హులైన రైతులకు మినీ గోకులాలు మంజూరు చేస్తాం. పాడి ఆవులతో పాటు, గొర్రెలు, మేకలు, కోళ్లకు సైతం షెడ్లు మంజూరు చేస్తాం. ప్రస్తుతం దరఖాస్తులు స్వీకరిస్తున్నాం. ఒక్కో రైతుకు ఒక్కసారి మాత్రమే ఈ యూనిట్ మంజూరు చేస్తాం.

– క్రిష్ణమోహన్‌రెడ్డి, ఎంపీడీఓ పాలసముద్రం

అర్హులకే యూనిట్లు



ప్రభుత్వం నిర్దేశించిన అన్ని అర్హతలూ ఉన్న చిన్న, సన్నకారు రైతులకే యూనిట్ మంజూరు చేస్తాం. లబ్ధిదారుకు ఉపాధి హామీ జాబ్ కార్డు ఉండాలి. అనువైన స్థలం, పశువులు ఉండాలి. ఉపాధి హామీ పథకం ద్వారా నిధులు మంజూరు చేస్తారు. షెడ్డు నిర్మాణంలో ప్రతి దశలోనూ ఫొటోలు తీసి జియోట్యాగింగ్ చేయాలి.

– ప్రభాకర్, పశుసంవర్ధక శాఖ జేడీ

గణిత మేధావి శ్రీనివాస రామానుజన్



మాట్లాడుతున్న ప్రిన్సిపల్ చంద్రమౌళి



మాట్లాడుతున్న ప్రిన్సిపల్ విజయులురెడ్డి

పుత్తూరు: గణిత మేధావి శ్రీనివాస రామానుజన్ అని ఎస్ఆర్ఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ బి.చంద్రమౌళి తెలిపారు. ఆదివారం కళాశాలలో జాతీయ గణిత శాస్త్ర దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ భారతదేశ గణిత శాస్త్రవేత్త శ్రీనివాస రామానుజన్ జయంతి రోజైన డిసెంబర్ 22న జాతీయ గణిత శాస్త్ర దినోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. తమిళనాడులోని అత్యంత నిరుపేద బ్రాహ్మణ కుటుంబంలో జన్మించిన రామానుజం ప్రపంచ మేధావిగా చరిత్రలో సుస్థిర స్థానం సంపాదించుకున్నారన్నారు. గణిత శాస్త్రం అన్ని శాస్త్రాలకు తల్లివంటిదన్నారు. విద్యార్థులు పాఠశాల స్థాయి నుంచే గణితాన్ని మక్కువతో అభ్యసించాలని సూచించారు. నేటి సమాజంలో గణిత శాస్త్రం ఎంతో ప్రాముఖ్యతను సంతరించుకుందని తెలిపారు. అంతకు ముందు శ్రీనివాస రామానుజం చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. విద్యార్థులకు గణిత శాస్త్ర పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో గణిత విభాగాధిపతి గాయత్రి, అధ్యాపకులు నరసింహారెడ్డి, వసంత్, శివ, తిరుమలయ్య, షర్మిల, వెంకటకృష్ణయ్య, సావిత్రి, సరేష్‌బాబు, మురళీమోహన్‌రెడ్డి పాల్గొన్నారు.

గణిత శాస్త్రం మూలస్తంభం

కార్వేటినగరం: గణిత శాస్త్రం సైన్స్ అండ్ టెక్నాలజీకి మూలస్తంభమని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ విజయులురెడ్డి అన్నారు. ఆదివారం డిగ్రీ కళాశాల గణిత శాస్త్ర విభాగాధిపతి ధనుంజయరెడ్డి ఆధ్వర్యంలో జాతీయ గణిత దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో కళాశాల ప్రిన్సిపల్ మాట్లాడుతూ గణిత శాస్త్రం అన్ని శాస్త్రాలకు మూల స్తంభం వంటిందని గుర్తు చేశారు. గణిత శాస్త్ర పితామహుడు శ్రీనివాస రామానుజన్‌ను విద్యార్థులు ఆదర్శంగా తీసుకుని విద్యనభ్యసించాలన్నారు. గణిత శాస్త్ర విభాగాధిపతి ధనుంజయరెడ్డి మాట్లాడుతూ రామానుజన్ సంఖ్య 1789 గురించి వివరించారు. శ్రీనివాస రామానుజన్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు సీఎస్ లత, జోగిప్రసాద్, విద్యార్థులు పాల్గొన్నారు.

వాకర్స్ అసోసియేషన్ నూతన కార్యవర్గం



నూతన కార్యవర్గంతో డాక్టర్ శ్రీనివాసులురెడ్డి

పుత్తూరు: పుత్తూరు వాకర్స్ అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని ఫౌండర్ ప్రెసిడెంట్ డాక్టర్ కె.శ్రీనివాసులురెడ్డి ఆధ్వర్యంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఆదివారం సంఘ భవనంలో జరిగిన సమావేశంలో అసోసియేషన్ అధ్యక్షుడిగా కేఎల్ మూర్తి, ఉపాధ్యక్షుడిగా గోపికృష్ణ, కార్యదర్శులుగా రఫీఅహ్మద్, మునికృష్ణయ్య, కోశాధికారిగా గుణశేఖర్‌రెడ్డి, టూర్ ఆర్గనైజర్‌గా మోహన్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు మూర్తి మాట్లాడుతూ అసోసియేషన్ అభివృద్ధికి నూతన కార్యవర్గం శక్తివంచన లేకుండా కృషి చేస్తుందని తెలిపారు.

చాంపియన్‌గా పుత్తూరు విద్యార్థి



విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపల్ కుమార్

పుత్తూరు: తిరుపతిలో జరిగిన ఇంటర్ పాలిటెక్నిక్ స్పోర్ట్స్ అండ్ గేమ్స్‌లో వ్యక్తిగత చాంపియన్‌షిప్‌ను పుత్తూరు ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థి ఎ.రోహిత్ కైవసం చేసుకున్నాడు. శనివారం జరిగిన పాలిటెక్నిక్ బాయ్స్ రీజనల్ మీట్ 2024–25 పోటీల్లో రోహిత్ లాంగ్ జంప్, ట్రిబుల్ జంప్ పోటీలలో ప్రథమ స్థానంలో నిలిచాడు. 100 మీటర్ల పరుగు పందెంలోనూ ద్వితీయ స్థానాన్ని కైవసం చేసుకున్నాడు. బ్యాడ్మింటన్ డబుల్స్‌లోనూ రోహిత్ జంట ప్రథమ స్థానంలో నిలిచింది. అధ్యాపకుల విభాగంలోనూ పుత్తూరు కళాశాల అధ్యాపకులు వెంకటేష్, గుణవర్ధన్ బ్యాడ్మింటన్ జట్టు ద్వితీయ బహుమతిని గెలుచుకుంది. పతకాలు సాధించిన విద్యార్థులు, అధ్యాపకులను కళాశాల ప్రిన్సిపల్ ఎస్వీకుమార్ అభినందించారు.

ఆవలకొండలో కార్డన్‌సెర్చ్



స్వాధీనం చేసుకున్న ద్విచక్రవాహనాలతో సీఐ శ్రీనివాసంతి

గంగాధరనెల్లూరు: ఆవలకొండ గ్రామంలో జీడీ నెల్లూరు పోలీసులు ఆదివారం కార్డన్ సెర్చ్ నిర్వహించారు. రికార్డులు లేని 25 ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. జీడీ నెల్లూరు ఇన్‌చార్జి సీఐ శ్రీనివాసంతి తెలిపిన వివరాల మేరకు తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాలకు చెందిన ద్విచక్ర వాహనాలను కొందరు వ్యక్తులు రికార్డులు లేకుండా అక్రమంగా తిప్పుతున్నారని పోలీసులకు సమాచారం అందింది. ఈ సమాచారం మేరకు పోలీసు సిబ్బందితో కలిసి ఇన్‌చార్జి సీఐ ఆదివారం ఉదయం మండలంలోని తూగుండ్రం పంచాయతీ ఆవలకొండ గ్రామంలో కార్డన్ సెర్చ్ నిర్వహించారు. 25 ద్విచక్ర వాహనాలకు సక్రమంగా సరైన రికార్డులు లేనట్లు గుర్తించారు. ఈ ద్విచక్ర వాహనాలను సీజ్ చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించామని, కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఇన్‌చార్జి సీఐ శ్రీనివాసంతి పేర్కొన్నారు.

రెండు వాహనాలకు ఒకే నంబర్



స్వాధీనం చేసుకున్న వాహనాలతో ఎస్‌ఐ రాజ్‌కుమార్, పోలీసులు

కార్వేటినగరం: రెండు వాహనాలకు ఒకే నంబర్ ఉన్నట్లు వాహన తనిఖీల్లో గుర్తించినట్లు ఎస్‌ఐ రాజ్‌కుమార్ తెలిపారు. ఆదివారం తమ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎస్‌ఐ రాజ్‌కుమార్ మాట్లాడారు. చిత్తూరు–పుత్తూరు జాతీయ రహదారిపై అమ్మపల్లి క్రాస్ వద్ద సిబ్బందితో కలసి వాహనాలు తనిఖీ చేస్తుండడంతో ఏపీ04వి 5035 నంబర్‌తో రెండు టాటా ఏస్ గూడ్స్ క్యారియర్ వాహనాలు ముందు వెనుక రావడంతో అనుమానించి పట్టుకున్నట్లు తెలిపారు. వాహనాల యజమాని కార్వేటినగరం మండలం, ఈదువారిపల్లి గ్రామానికి చెందిన ఎ.హేమకుమార్‌ను విచారించామని తెలిపారు. పోలీసుల చలానాల నుంచి తప్పించుకోవడానికి ఆ యజమాని ఒక వాహనానికి ఉన్న రికార్డులతో రెండు వాహనాలను నడుపుతున్నట్లు విచారణలో తేలినట్లు ఎస్‌ఐ పేర్కొన్నారు. ఆ రెండు వాహనాలను స్వాధీనం చేసుకుని, జిల్లా జిల్లా ఆర్‌టీఓకు ఫిర్యాదు చేశామన్నారు.

వ్యవసాయంపై దృష్టి సారించాలి



మొక్కలు నాటుతున్న రైతులు, గ్రామస్తులు

గంగాధరనెల్లూరు: మండల కేంద్రంలో ఆదివారం ముందస్తు రైతు దినోత్సవాన్ని రైతులు ఘనంగా నిర్వహించారు. డిసెంబర్ 23వ తేదీన రైతు దినోత్సవం కావడంతో ముందస్తుగా కేక్ కట్ చేసి రైతులకు పంచిపెట్టారు. కనుమరుగవుతున్న భారతదేశ వ్యవసాయంపై జేఫాం ఫీల్డ్ అధికారి సౌజన్య, ఎంఎల్‌హెచ్‌పీ కవిత రైతులకు, మహిళలకు అవగాహన కల్పించారు. ఆధునిక కాలంలో వ్యవసాయం కనుమరుగు కాకుండా సులభతరంగా పాడిపంటలను పండించాలన్నారు. రైతులు అందుబాటులో ఉన్న యాంత్రిక పరికరాలను సద్వినియోగం చేసుకొని మెరుగైన వ్యవసాయాన్ని చేయడానికి ముందుకు రావాలన్నారు. దీనిపై అవగాహన కల్పించడానికి ఎల్లప్పుడూ సిద్ధంగా ఉన్నామన్నారు. ఈ కార్యక్రమంలో రైతులు రామచంద్రన్, చిన్న దొరై, గుండయ్య, ఫీల్డ్ అసిస్టెంట్ నాగరాజ్, సభమణి గుణశేఖర్, మహిళలు పాల్గొన్నారు.

ఘనంగా జగన్ పుట్టినరోజు వేడుకలు

కార్వేటినగరం: వైఎస్ఆర్ సీపీ అధ్యక్షులు వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి జన్మదిన వేడుకలను రెండో రోజు ఆదివారం ఘనంగా నిర్వహించారు. వైఎస్ఆర్ సీపీ జీడీనెల్లూరు నియోజకవర్గం ఇన్‌చార్జి కృపాలక్ష్మి, ఎంపీపీ లతాబాలాజీ, మండల అధ్యక్షుడు శేఖర్‌రాజు, మాజీ మండల కన్వీనర్ ధనుంజయవర్మలతో కలసి గోపిశెట్టిపల్లిలో భారీ కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా నియోజకవర్గం ఇన్‌చార్జి కృపాలక్ష్మి మాట్లాడుతూ ప్రజా సంక్షేమమే లక్ష్యంగా పని చేసిన ఏకైక ముఖ్యమంత్రిగా జగనన్న చిర స్థాయిగా నిలిచిపోయారని గుర్తు చేశారు. గంగమాంబాపురం గ్రామంలో కూడా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జన్మదిన వేడుకలను నిర్వహించారు. జిల్లా ప్రధాన కార్యదర్శి బాలాజీ, సీనియర్ నాయకులు చందురాజు, కో–ఆప్షన్ మెంబర్ పట్నం ప్రభాకర్‌రెడ్డి, మాజీ సింగిల్‌విండో అధ్యక్షుడు లోకనాథరెడ్డి, ఎంపీటీసీ మురగయ్య, సర్పంచ్ చిన్న, మాజీ సర్పంచ్ అంకయ్య, సురేష్, అజిత్ తదితరులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ పద్మవ్యూహం

- పెరిగిన వాహనాల వినియోగం
- ఆక్రమణలతో కుచించుకుపోతున్న రోడ్లు
- శుక్రవారమైతే రోడ్లుపై ప్రయాణం గగనం
- ట్రాఫిక్‌తో మానసిక, శారీరక సమస్యలు



ఏకాంరబకుప్పం రైల్వేగేటు వద్ద ట్రాఫిక్

నగరి: పట్టణంలో రోజురోజుకూ ట్రాఫిక్ సమస్య జఠిలంగా మారుతోంది. వ్యక్తిగత వాహనాల వినియోగం విపరీతంగా పెరగడం, రోడ్డు విస్తరణ చేసినా ఆక్రమణలకు గురికావడంతోనే ఈ సమస్య తలెత్తుతోంది. ప్రధానంగా కార్ల వాడకం ఇబ్బడిముబ్బడిగా పెరిగిపోయింది. పట్టణ పరిధిలోని పళ్లిపట్టు రోడ్డు, బజారు రోడ్డులో నిత్యం ట్రాఫిక్ రద్దీ తీవ్రంగా ఉంటోంది. సుదూర ప్రాంతాల నుంచి సంతలో కూరగాయల కొనుగోలుకు విచ్చేసే వారు వాహనాలు ఎక్కడ పెట్టాలనే అంశం ప్రశ్నార్థకంగా మారుతోంది. ఏకాంబరకుప్పం రైల్వేగేటు పడిన సమయాల్లో ట్రాఫిక్ రద్దీ మరింతగా పెరుగుతోంది. దీంతో ట్రాఫిక్ సమస్యతో వాహనదారులు, ప్రయాణికులు నరకం చూస్తున్నారు. ట్రాఫిక్ అస్తవ్యస్తంగా తయారైంది. పలుచోట్ల చిరువ్యాపారులు రోడ్లపైనే దుకాణాలు పెట్టేస్తున్నారు. దీంతో రోడ్లన్నీ చాలావరకు బ్లాక్ అవుతున్నాయి. ట్రాఫిక్‌లో డ్రైవింగ్ చేస్తూ తీవ్రమైన మానసిక ఒత్తిళ్లకు గురవుతున్న వారి సంఖ్య ఎక్కువగా ఉంటుంది. రద్దీగా ఉన్న రోడ్లపై డ్రైవింగ్ చేసే వారికి కాలుష్యంతో అనారోగ్య సమస్యలు వచ్చిపడుతాయని వైద్యులు హెచ్చరిస్తున్నారు. అతివేగంగా వాహనాలు నడిపే ఆకతాయిలు, ఆటో.. ఇటో తెలియకుండా నడిపే ఆటోలు, స్టాపింగ్‌లో ఉంచడానికి రోడ్డుకు అడ్డంగా తిరుగుతూ నిలబడే బస్సుల నడుమ డ్రైవింగ్ చేస్తూ టెన్షన్‌కు గురవుతూ కొందరు రోగాల బారిన పడుతున్నారు. శుక్రవారమైతే బస్టాండు ప్రాంగణం దాటడానికి అరగంట సమయం పడుతోంది.

వైద్యులు గుర్తించిన సమస్యలు

- ట్రాఫిక్‌లో ప్రయాణించే వారు యాంగ్జయిటీకి గురవుతున్నారు.
- అప్పటికే యాంగ్జయిటీ ఉన్న వారు తీవ్రమైన ఒత్తిళ్లకు లోనవుతున్నారు.
- యాంగ్జయిటీకి గురయ్యే వారు కార్యాలయానికి వెళ్లిన గంట వరకూ పనిపై దృష్టి పెట్టలేకపోతున్నారు.
- నిత్యం ట్రాఫిక్‌లో డ్రైవింగ్ చేసే వారు చిన్న వయస్సులోనే హైపర్ టెన్షన్ బారిన పడే అవకాశం ఉంది.
- ట్రాఫిక్‌లో ప్రయాణంతో నిద్రలేమి సమస్యలు తలెత్తుతున్నాయి.

తప్పని అనారోగ్య సమస్యలు



ట్రాఫిక్ రద్దీ ఎక్కువగా ఉన్నప్పుడు డ్రైవింగ్ చేయడం ద్వారా కొందరు యాంగ్జయిటీకి గురవుతారు. చేరుకోవాల్సిన గమ్యం త్వరగా చేరుకోవాలన్న ఆత్రుత, చికాకుతో ట్రాఫిక్ నుంచి బయటకు రాగానే రాష్ డ్రైవింగ్ చేస్తుంటారు. అందుకే వాహనదారులు హెల్మెట్, సీట్ బెల్ట్ తప్పనిసరిగా ధరించాలి. నిద్రలేమి, హైపర్ టెన్షన్ బారిన పడుతున్న వారు ఉంటున్నారు. ట్రాఫిక్‌లో ప్రయాణించిన వారు కార్యాలయానికి వెళ్లినా వెంటనే పనిపై దృష్టి పెట్టలేరు.

– డాక్టర్ కార్తీక్, వైద్యుడు, నగరి ఏరియా ఆస్పత్రి

ట్రాఫిక్ నియంత్రణకు చర్యలు



ట్రాఫిక్ నియంత్రణకు అవసరమైన చర్యలు తీసుకుంటున్నాం. రోడ్డుకడ్డంగా దుకాణాలు పెట్టేవారికి, రోడ్లపై ఎక్కడబడితే అక్కడ వాహనాలు ఆపేవారికి జరిమానాలు విధిస్తున్నాం. రోడ్డు ఆక్రమణదారులపై మున్సిపల్ అధికారులతో కలిసి చర్యలు తీసుకుంటాం. హెల్మెట్ వాడకంపై వాహనదారులకు అవగాహన కల్పిస్తున్నాం.

– మహేశ్వర్, సీఐ, నగరి సర్కిల్

వైభవంగా కల్యాణోత్సవం



ఉభయదారులకు స్వామివారి చిత్ర పటాన్ని ఇస్తున్న అర్చకులు

గంగాధరనెల్లూరు: వేపంజేరి గ్రామంలోని శ్రీలక్ష్మీ నారాయణ స్వామి దేవస్థానంలో కల్యాణోత్సవం, ఆయుష్ హోమం ఆదివారం వైభవంగా నిర్వహించారు. ఆలయంలో స్వామి, అమ్మవార్లకు ప్రత్యేక అభిషేకం నిర్వహించి, పట్టు వస్త్రాలతో అలంకరించారు. పూలాహారాలతో జోడించి మేళతాళాలు, వేదమంత్రాలు నడుమ కల్యాణోత్సవం వైభవంగా నిర్వహించారు. ఆలయంలో అర్చకుల ఆధ్వర్యంలో ఆయుష్ హోమం అతి వైభవంగా నిర్వహించారు. టీటీడీకి చెందిన అన్నమాచార్య ప్రాజెక్టు ఆధ్వర్యంలో భాగవతార్ వనజ కుమారి హరికథ కాలక్షేపం చేయగా, రెడ్డెమ్మ వెంకటేశ్వర భక్తి గీతాలను పాడారు. సుమిత్ర, వెంకటేశులురెడ్డి పాల్గొన్నారు.

శాస్త్రీయ దృక్పథం అలవర్చుకోవాలి



ఎగ్జిబిషన్‌ను పరిశీలిస్తున్న రాధికారెడ్డి

పుత్తూరు: విద్యార్థులు శాస్త్రీయ దృక్పథం అలవర్చుకోవాలని ఎన్టీఆర్ యూనివర్సిటీ ఎండీ డాక్టర్ వేమిరెడ్డి రాధికారెడ్డి సూచించారు. ఆదివారం స్థానిక కేకేసీ హోమియోపతి వైద్య కళాశాలలో హెల్త్ సైన్స్ ఎక్స్‌పో–2024ను ఆమె ప్రారంభించారు. అనంతరం ఎగ్జిబిషన్‌ను పరిశీలిస్తూ విద్యార్థులను ప్రోత్సహించారు. కార్యక్రమంలో కళాశాల చైర్మన్ కె.కుప్పయ్యశెట్టి, డాక్టర్ కె.శ్రీనివాసులురెడ్డి, వైస్ చైర్మన్ నరసింహారావు, కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ జి.శరవణన్ పాల్గొన్నారు.

వైభవంగా కెరవా క్రిస్మస్ వేడుకలు



మరియ, యోసేపు, దేవదూతల వేషధారణ

నగరి: పట్టణంలో కెరవా క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఆదివారం చావడి సీఎస్ఐ వెస్ట్ చర్చి ఎస్ వినయ్‌కుమార్ ఆధ్వర్యంలో జరిగింది. ఈ సందర్భంగా మహిళలు మరియ, యోసేపు, దేవదూతల వేషధారణల్లో ఆకట్టుకున్నారు. చావడి నుంచి పళ్లిపట్టు, నాగలాపురం, తిరుత్తణి రోడ్డు మీదుగా ఊరేగింపు సాగింది. పట్టణంలోని ప్రజలకు కేక్, ఆహారం అందిస్తూ, క్రీస్తు పుట్టుకను తెలియజేశారు. చిన్నారులకు బహుమతులు అందించారు. దేవుని కీర్తనలు పాడుతూ, నృత్య ప్రదర్శనలు చేశారు. ఈ కార్యక్రమంలో సత్యమూర్తి, క్రిస్టిబాబు, సంఘ పెద్దలు, విశ్వాసులు పాల్గొన్నారు.